క్లుప్తంగా

సబ్సిడీపై టమాటా విక్రయాలు



కంకిపాడు: పెరుగుతున్న టమాటా ధరలు ప్రజలపై భారం కాకుండా రైతుబజారుల్లో సబ్సిడీపై టమాటా విక్రయాలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా మంగళవారం 1500 కిలోలు టమాటా కంకిపాడు రైతుబజారుకు చేరుకుంది. రెండు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసి ప్రజలకు కిలో రూ. 50 చొప్పున టమాటా విక్రయించారు. బయటి మార్కెట్‌లో టమాటా ధరలు రూ. 100కు పైగా ఉంది. దీంతో కొనుగోలుదారులు రైతు బజారులో బారులు తీరారు. పంపిణీ ప్రక్రియను ఎస్టేట్ అధికారి చంద్రమోహన్ పర్యవేక్షించారు.

గన్నవరం: స్థానిక రైతుబజార్‌లో మంగళవారం నుంచి రాయితీపై టమాటా విక్రయాలు ప్రారంభించారు. బహిరంగ మార్కెట్‌లో టమాటా కిలో వంద రూపాయలకుపైగా పలుకుతుండడంతో రాష్ట్ర ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ ద్వారా రూ.50కే విక్రయాలు చేపట్టింది. రాయితీపై టమాటాలు కొనుగోలు చేసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో రైతుబజార్‌కు తరలివచ్చారు. తొలిరోజు రెండు ప్రత్యేక కౌంటర్ల ద్వారా 40 బాక్సుల టమాటాలను విక్రయించారు. టమాటా విక్రయాలను ఆర్‌ఐ టి.ఉదయ్, వీఆర్‌ఓ రాజబాబు, రైతుబజార్ సిబ్బంది పర్యవేక్షించారు.

ఆలయంలో అన్నసమారాధన



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో మంగళవారం అన్నమారాధన కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆలయంలో శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజ భక్తులు చేశారు. దేవస్థానంలో శ్రీ పార్వతీ అమ్మవారికి శాకంబరి ఉత్సవాలు జరుగుతుండటంతో భక్తులకు అన్నసమారాధన చేశారు. దాదాపు రెండు వేల మంది భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం అమలు తీరు పరిశీలించిన ఎంఈవో

హనుమాన్‌జంక్షన్‌రూరల్: విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం అందిస్తుందని బాపులపాడు ఎంఈవో-2 సురేష్ కుమార్ అన్నారు. స్థానిక నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం మధ్యాహ్న భోజనం పథకం పనితీరును ఆయన పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి జగనన్న గోరుముద్దపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వితరణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం ఓగిరాలలోని ఎంపీపీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్ జంక్షన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా నోట్ పుస్తకాలు, స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ సభ్యుడు మేడికొండ బుచ్చిబాపయ్య ఆర్థికసాయంతో గ్రామంలోని రెండు ఎంపీపీ స్కూళ్లలో చదువుతున్న 105 మంది చిన్నారులకు వీటిని పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ వీరమాచినేని రామబ్రహ్మం, సర్పంచ్ కగ్గా పద్మావతి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చలసాని వెంకటేశ్వరరావు, కార్యదర్శి అక్కినేని రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

సూరంపల్లి పాలకేంద్రం అధ్యక్షుడిగా రాంబాబు

గన్నవరంరూరల్: మండలంలోని సూరంపల్లి పాలకేంద్రం అధ్యక్షుడిగా మంగళవారం ఈలప్రోలు రాంబాబు మరోసారి ఎన్నికయ్యారు. అంగిరేకుల ఏడుకొండలు, జాజుల సాంబశివరావు, లోకం వెంకట సురేష్, కొసనం బాలయ్య, బొడ్డపాటి బసవపూర్ణయ్య, పాలేటి వెంకటేశ్వరరావు, గుర్రం వీరాంజనేయులు, నున్న ఏడుకొండలు, బొమ్మోతు ఏడుకొండలు డైరెక్టర్‌లుగా ఎన్నికయ్యారు. వచ్చే ఐదేళ్ల కాలానికి ఈ కార్యవర్గం పాల ఉత్పత్తిదారులకు సేవలందిస్తుందన్నారు.

వృద్ధురాలు ఆత్మహత్య ఘటనపై కేసు నమోదు

గన్నవరం: ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన స్థానిక రాయ్‌నగర్‌లో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం...రాయ్‌నగర్‌లోని ఎల్‌కే టవర్‌లో నివాసం ఉంటున్న కాత్రగడ్డ కుసుమాదేవి(64) భర్త ఏడాదిన్నర క్రితం మృతి చెందారు. కుటుంబ అవసరాల నిమిత్తం చేసిన అప్పుల కారణంగా ఆమె ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు కుమారుడికి, కోడలికి మధ్య తలెత్తిన వివాదాల కారణంగా కుమారుడు విడాకులకు దరఖాస్తు చేసుకున్నాడు. ఆర్థిక, కుటుంబ ఇబ్బందులతో తీవ్ర మనస్తాపానికి గురైన కుసుమాదేవి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై గన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

‘సురక్ష’తో ప్రజల వద్దకే సంక్షేమం

కంకిపాడు(పెనమలూరు): జగనన్న సురక్షతో ప్రజల వద్దకే సంక్షేమం, సుపరిపాలన అందుతున్నాయని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని మద్దూరు గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వివిధ రకాల సేవలకు చెందిన 456 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు మాట్లాడుతూ సచివాలయాల ద్వారా అన్ని రకాల సేవలు సమర్థంగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, తహసీల్దార్ ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్, సర్పంచ్‌లు చిప్పల రామదాసు, పి.వరప్రసాద్, ఎంపీటీసీ వడుగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వారం రోజుల్లో పరిష్కారం..

పెనమలూరు: జగనన్న సురక్షలో సమస్యలు తమ దృష్టికి తీసుకు వస్తే వారం రోజుల్లో పరిష్కారం చేస్తామని ఎంపీడీవో సునీతాశర్మ అన్నారు. మండల పరిధిలోని గంగూరు సచివాలయం-1లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జగనన్న సురక్షలో ప్రతి గ్రామంలో ఇంటింటికీ సర్వే చేసి సమస్యలు నమోదు చేస్తున్నామన్నారు. 11 రకాల సర్టిఫికెట్లు వారం రోజుల్లోనే జారీ చేస్తున్నామని వివరించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సర్వే చేసిన సమయంలో ఆయా గ్రామాల ప్రజలు తమ సమస్యలు వారని దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా



ఉయ్యూరు 2వ వార్డులో పత్రాలు అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ

107 సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. తహసీల్దార్ వెంకటశివయ్య, ఎంఈవో-1 శేషగిరిరావు, ఏవో లోయ శివశంకర్‌రావు, ఈవో సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. నేడు గోసాల-1 సచివాలయంలో జగనన్న సురక్ష ఉంటుంది.

సమస్యలకు సత్వర పరిష్కారం

పెనమలూరు: జగనన్న సురక్ష కార్యక్రమంలో సమస్యలు సత్వర పరిష్కారం చేస్తామని తాడిగడప మునిసిపాలటీ కమిషనర్ డాక్టర్ ఎన్.ప్రకాశరావు అన్నారు. తాడిగడప మునిసిపాలిటీ పరిధి కానూరు-4 సనత్‌నగర్‌లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ జగనన్న సురక్షలో వచ్చిన దరఖాస్తులు పరిష్కారం చేసి వారం రోజుల్లో సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేస్తామన్నారు. సమస్యలు ఉన్నవారు జగనన్న సురక్షలో సమస్యలు పరిష్కారం చేసుకోవాలని సూచించారు. సచివాలయ క్లస్టర్ ఇన్‌చార్జ్ చాంద్‌బాషా మాట్లాడుతూ



మద్దూరులో ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు

గ్రామాల్లో సుపరిపాలన తీసుకు వచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కిందన్నారు. సీఎం నిత్యం ప్రజల సమస్యలు గుర్తించి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. కార్యక్రమంలో 352 సర్టిఫికెట్లు ఇచ్చారు.

పోరంకిలో..

పోరంకి సచివాలయం-2లో జరిగిన జగనన్న సురక్షలో తాడిగడప మునిసిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్ అభినేష్ 187 సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ వేమూరి బాలకృష్ణ, నేతలు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు..

ఉయ్యూరు: జగనన్న సురక్షతో ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. పట్టణంలోని 2వ వార్డు సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సచివాలయం పరిధిలోని



గంగూరులో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ సునీతాశర్మ, తహసీల్దార్ వెంకటశివయ్య



కానూరులో సర్టిఫికెట్లు అందజేస్తున్న కమిషనర్ ప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నేతలు

237 మంది లబ్ధిదారులకు 11 రకాల సేవలకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు అందించారు. చైర్మన్ వల్లభనేని నాని మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు వరంగా మారిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, కౌన్సిలర్లు వణుకూరు సుభద్రాదేవి, గుంజా సుధాకర్‌బాబు, కోరాడ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రామవరప్పాడు: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని జెడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు అన్నారు. విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులో మంగళవారం అర్హులైన లబ్ధిదారులకు పలు రకాల సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులు 15, కొత్త ఆరోగ్యశ్రీ దరఖాస్తులు 4, కుల ధ్రువీకరణ పత్రాలు 152, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 109 సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్ల మండల అధ్యక్షుడు సాదం వెంకటేశ్వరరావు, ఎంఈవో వెంకటర్నతం, ఎంపీటీసీలు దూరు రత్నం, వార్డు సభ్యుడు పిన్నిబోయిన రవి, వీఆర్వో చక్రధరరావు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఘనంగా విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారం

గన్నవరం: విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరూ నాయకత్వ లక్షణాలను పెంచుకోవాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పి.రాజశేఖర్ సూచించారు. స్థానిక వీఎస్ సెయింట్‌జాన్స్ పాఠశాలలో మంగళవారం విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల బాలుర, బాలికల నాయకులు బి. ప్రణీత్, ఆర్.శ్రీనిధి, కళాశాల బాలుర, బాలికల నాయకులు శ్యాన్‌డన్, భవితో రాజశేఖర్ ప్రమాణ స్వీకారం చేయించారు. పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్, 39 బెటాలియన్ సెకండ్ కమాండర్ రాజేష్ తివారీ, పూర్వ విద్యార్థి హరివిశ్వనాథ్, సీనియర్ బ్రదర్లు సీజే థామస్, జిమ్మికురియాకోస్, భల్లాజోసఫ్, జయబాలన్ తదితరులు పాల్గొన్నారు.

విప్లవ వీరుడు అల్లూరికి ఘన నివాళి

పెనమలూరు: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతిని తాడిగడప మునిసిపాలిటీ, పెనమలూరు మండలంలో ఘనంగా చేశారు. కానూరు అశోక్ జిమ్‌లో క్రీడాకారులు అల్లూరి ఫొటోకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి తాళ్లూరి అశోక్ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం అల్లూరి సీతారామరాజు పోరాటం చేసి వీరమరణం పొందారన్నారు. కార్యక్రమంలో ఏపీ కోఆపరేటివ్ డీసీవో త్రినాథ్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

యువత ఆదర్శంగా తీసుకోవాలి: కమిషనర్

దేశం కోసం పోరాడి ప్రాణాలు అర్పించిన అల్లూరి సీతారామరాజు ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని తాడిగడప కమిషనర్ ఎన్.ప్రకాశరావు అన్నారు. కానూరు సచివాలయం-4లో అల్లూరి జయంతిని మంగళవారం నిర్వహించారు అల్లూరి ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు చాంద్‌బాషా, లతీఫ్, ఖాదర్, సద్దిఖ్, పలువురు పాల్గొన్నారు.

పెనమలూరు పరిధిలో..

మండల పరిధిలో గంగూరులో అల్లూరి సీతారామరాజు జయంతి చేశారు. ఎంపీడీఓ సునీతాశర్మ, తహసీల్దార్ వెంకటశివయ్య, ఎంఈవో శేషగిరిరావు పాల్గొని అల్లూరి ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వణుకూరు, గంగూరు, గోసాల, పోరంకి గ్రామాలలో ఐసీడీఎస్ సీడీపీవో కె.బేబీసుకన్య పాల్గొన్నారు. సూపర్‌వైజర్లు టి.రమానాగమణి, జి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి జయంతి..

ఉయ్యూరు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి ఎంపీడీఓ విమాదేవి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అల్లూరి స్వాతంత్రోద్యమ పోరాట స్ఫూర్తిని గుర్తుచేశారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కంకిపాడు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు మండలంలోని మద్దూరు సచివాలయంలో మంగళవారం ఘనంగా



కానూరులో అల్లూరి జయంతి చేస్తున్న కమిషనర్ ప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నేతలు

నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు మాట్లాడుతూ గిరిజనుల ఉద్ధరణకు పాటుపడ్డ పోరాట యోధుడు అల్లూరి అని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, సర్పంచ్ చిప్పల రామదాసు, ఎంపీటీసీ వడుగు శ్రీనివాసరావు, తహసీల్దార్ ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

మన్యం వీరుడికి నివాళులు..

విజయవాడరూరల్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమం మంగళవారం విజయవాడరూరల్ మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీషువారితో అలుపెరగని పోరాటం చేసి ప్రాణాలు అర్పించిన అల్లూరి సీతారామరాజు దేశభక్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీడీఓ శేషగిరిరావు అన్నారు. తొలుత సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ ఏఈ రామకృష్ణారావు, పీఆర్ ఏఈ శివరామకృష్ణ పాల్గొన్నారు.

ఉంగుటూరులో ఘనంగా అల్లూరి జయంతి

ఉంగుటూరు: మండల పరిషత్ కార్యాలయం వద్ద మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్ర పటానికి ఎంపీపీ వడ్లమూడి సరోజిని



ఉయ్యూరులో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ విమాదేవి

పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిరావు, ఈవోఆర్‌డీ బాషా, పలు గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

నిత్య స్ఫూర్తి అల్లూరి..

గన్నవరంరూరల్: నిత్యస్ఫూర్తి విప్లవ వీరుడు అల్లూరి సీతారామారాజు అని వక్తలు కొనియాడారు. మంగళవారం ఆయన జయంతిని పురస్కరించుకుని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం వద్ద అల్లూరి చిత్రపటానికి లైబ్రేరియన్ కె.కృపానందం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి పాఠకులు నివాళులర్పించారు.

గన్నవరంలో..

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి ఎంపీపీ అనగాని రవి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ. గౌసాని, ఎంపీడీవో సత్యకుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ సభ్యుడు పడమట రంగారావు, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ ఏఎస్‌ఆర్ కోటేశ్వరరావు, పలువురు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి సబ్‌రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు పుష్పాంజలి ఘటించారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక గుడ్‌మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అల్లూరి జయంతి నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులు చిప్పాడ చంద్రశేఖర్‌రావు, దేవరపల్లి, నూజివీడు ఎంపీడీవో వీవీ విజయకుమార్, వైఎస్సార్‌సీపీ నేత నిడమర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వీఎం రంగాకు ఘన నివాళులు

కంకిపాడు: వంగవీటి మోహన రంగా జయంతి వేడుకలు కంకిపాడు పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బస్టాండు కూడలిలోని రంగా విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి బండి నాంచారయ్య మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి రంగా కృషి చేశారన్నారు. రంగా ఆశయ సాధనకు నేటి యువత పాటుపడాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ చైర్మన్ మేదంద్రావు కుటుంబరావు, నాయకులు పాల్గొన్నారు.

జంక్షన్‌లో..

హనుమాన్‌జంక్షన్ రూరల్: బడుగు, బలహీన వర్గాలకు అండగా పోరాడిన వంగవీటి మోహనరంగా ఉద్యమస్ఫూర్తి ఆదర్శనీయమని పలువురు కొనియాడారు. దివంగత ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం హనుమాన్‌జంక్షన్‌లో ఘనంగా జరిగాయి. స్థానిక గుడివాడరోడ్డులోని వంగవీటి మోహనరంగా విగ్రహానికి పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జోహార్ వంగవీటి మోహనరంగా అంటూ నినాదాలు చేశారు. అనంతరం బర్త్‌డే కేక్‌ను కట్ చేశారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, ఎంపీపీ యర్రగొర్ల



కంకిపాడు ప్రధాన సెంటర్‌లో రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నగేష్, ఎంపీటీసీ సభ్యుడు పడకల కోటేశ్వరరావు, అభయాంజనేయ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ కేతినీడి జైనేంద్రకుమార్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ యర్రంశెట్టి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గన్నవరంలో..

గన్నవరం: స్థానిక కాపు ఐక్య సమ్మేళనం కార్యాలయంలో మంగళవారం వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రంగా చిత్రపటానికి కాపు ఐక్య సమ్మేళనం నియోజకవర్గ అధ్యక్షుడు తోట వెంకయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాపు నాయకులు దామెర్ల సీతారామయ్య, పామర్తి మాధవరావు, మాదల వెంకటేశ్వరరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మానికొండ సూర్యావతి త్యాగనిరతి ఆదర్శనీయం

గన్నవరం: స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం కమ్యూనిస్టు ఉద్యమ నాయకురాలు మానికొండ సూర్యావతి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి ఐద్వా, పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మల్లంపల్లి జయమ్మ మాట్లాడుతూ సూర్యావతి త్యాగనిరతి అందరికీ ఆదర్శనీయమన్నారు. ఉంగుటూరు ఎంపీపీగా, ఎమ్మెల్సీగా ఆమె పేద ప్రజలకు ఎనలేని సేవలందించారని చెప్పారు. ఇంటింటికి మరుగుదొడ్లు కట్టించడం ద్వారా ఆమె దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. పార్టీ నాయకులు అనుమోలు వెంకటేశ్వరరావు, పిల్లి మహేష్, ఉదయ్‌భాస్కర్, ఐద్వా నేతలు సీహెచ్‌వీ లక్ష్మి, ఓరుగంటి మరియమ్మ, రాణి, పఠాన్ సల్మా తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

పెనమలూరు: పోరంకి గ్రామంలో ఇరు కుటుంబాల వారు ఘర్షణకు దిగటంతో పోలీసులు కౌంటర్ కేసులు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిశోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం బొంగరాల శిరీష, ఆర్.అనూష ఇంటిపక్కనే ఉంటారు. వీరికి గతంలో పాత కక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం శిరీష, ఆమె కుటుంబ సభ్యులపై ఆర్.అనూష, భర్త జ్ఞానేంద్ర దాడి చేశారని ఫిర్యాదు అందింది. అదే విధంగా జ్ఞానేంద్ర అతని కుటుంబ సభ్యులపై శిరీష, ఆమె భర్త సుధాకర్ మరి కొందరు దాడి చేశారని ఫిర్యాదు అందటంతో పోలీసులు ఇరు కుటుంబాలపై మంగళవారం కౌంటర్ కేసులు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ మృతి

గన్నవరం: ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందిన ఘటనపై మంగళవారం గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. మండలంలోని ముస్తాబాద గ్రామానికి చెందిన షేక్ అలీమున్నీసా(32) కొంతకాలంగా రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో నొప్పి తాళలేక గత నెల 5న ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రికి తరలించారు. అప్పటినుంచి అక్కడ చికిత్స పొందుతున్న మున్నీసా మంగళవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. ఆమెకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



మారేడుమాకలో పూర్తయిన వరి నాట్లు



కంకిపాడులో నాట్లకు సిద్ధమవుతున్న వరి నారుమడి



తెన్నేరులో పొలం దమ్ము చేస్తున్న ట్రాక్టర్

వడివడిగా ఖరీఫ్

అన్నదాతలు ఖరీఫ్ సాగు పనుల్లో నిమగ్నమవుతున్నారు. రుతుపవనాల ప్రభావంతో తొలకరి పలకరించింది. మరోవైపు ప్రభుత్వ ఆదేశాలతో కాలువలకు ఇరిగేషన్ శాఖ ముందుగానే నీటిని విడుదల చేసింది. బోర్లు సదుపాయం, కాలువల వెంబడి ఉన్న భూముల్లో రైతులు ఆయా ప్రాంతాలకు అనువైన నోటిఫైడ్ విత్తన రకాలను ఎంపిక చేసుకుని వరి నారుమడులు పోసుకున్నారు. ప్రధానంగా పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు ప్రాంతాల్లో బోర్లు సదుపాయం ఉన్న భూముల్లో వరి నారుమడులు చేతికొచ్చాయి. దీంతో భూములను దమ్ము చేసి వరి నాట్లను చేపడుతున్నారు. మరికొన్ని గ్రామాల్లో వరి నారుమడి సస్యరక్షణ, వరినాట్లకు భూములను సన్నద్ధం చేసుకునే పనిలో రైతన్నలు బిజీగా ఉన్నారు.

– కంకిపాడు